పరీక్షలనగానే భయపడొద్దు

ఒత్తిడి వద్దు.. ఆత్మవిశ్వాసమే ముద్దు..

ప్రణాళికాబద్ధంగా చదవడం అవసరం

చక్కటి ఆహారం, తగినంత నిద్ర తప్పనిసరి అంటున్న నిపుణులు

పరీక్షలనగానే ఏదో భయం..వెంటాడే ఆందోళన.. అన్నీ చదవాలి.. కాని ఏది ముందు చదవాలో తెలియని గందరగోళం.. ఇంట్లో అమ్మానాన్నల ర్యాంకుల టార్గెట్.. ఫ్రెండ్స్ మధ్య పోటీ.. పరీక్షలు దగ్గరపడుతున్నా కొద్దీ విద్యార్థులు ఆందోళనకు గురవుతుంటారు. చదివింది బుర్రకెక్కడం లేదని, లోలోపన మదనపడుతుంటారు. మానసిక ఒత్తిడి పెరుగుతుంది. దీంతో ఫెయిల్ అవుతామనే భయం.. తక్కువ మార్కులు వస్తే అందరిలో తలెత్తుకోలేమన్న భావన.. తల్లిదండ్రులు తమపై పెంచుకున్న ఆశలు తీర్చగలమా..? అనే బెంగ.. ఒత్తిడిని తగ్గించుకుంటే ఏకాగ్రత సాధ్యమవుతుందని, దానిని అధిగమించడం ద్వారా విజయాన్ని సులువుగా సాధించొచ్చని నిపుణులు అంటున్నారు. ఇందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, సందేహాలను నివృత్తి చేసే అధ్యాపకులు బాధ్యత తీసుకోవాలని చెబుతున్నారు. విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్న వేళ కొన్ని సలహాలు.. సూచనలపై ప్రత్యేక కథనం.

- ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 13

పరీక్షలు అందరికీ సమానమే..

పరీక్షలు అందరికీ సమానమే. వాటికి గొప్ప, పేద, అనే తేడా లేదు. ప్రశ్నలందరికీ ఒకేలా ఉంటాయి. వాటికి సమాధానమివ్వడంలోనే తృప్తి, అసంతృప్తి కలుగుతుంటాయి. విద్యార్థులు పరిపూర్ణ ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధపడితే సంతృప్తితో కూడిన ఆనందాన్ని దర్జాగా పొందవచ్చు.

మరికొద్ది రోజుల్లో పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కాను

ఆత్మవిశ్వాసంతో ఒత్తిడికి చెక్

న్నాయి. పాఠశాలలు, కళాశాలల్లో ఇప్పటికే అన్ని సబ్జెక్టులకు సంబంధించిన సిలబస్ పూర్తయింది. కాలం వేగంగా పరిగెడుతూ పరీక్షలను మరింత దగ్గర చేస్తున్నాయి. చదవాలి.. బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలి.. మార్కులు తక్కువ వస్తు తలెత్తుకోలేం.. అని తరచూ గుర్తుకొస్తుంది. మరోవైపు పుస్తకం తెరిస్తే ఏదో ఒక ఆటంకం.. చదివింది బుర్రకెక్కకపోవడం.. నిమిషాలు, గంటలు వేగంగా దొర్లుతూ ఉంటాయి. అదే సమయంలో మనసుపై దాడిచేసే ఒత్తిడిని ప్రతి విద్యార్థికి నెమ్మదిగా ఎదుర్కోవడానికి యత్నించాలి. ఒకసారి ఎదురుదాడికి యత్నిస్తే ఒత్తిడి తోక ముడుస్తుంది. అందుకు ప్రతి విద్యార్థి తనపై తనకున్న విశ్వాసాన్ని గుర్తించాలి. అదే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి పరీక్షలు రాయాలి.

సందేహాలను నివృత్తి చేయాలి

పరీక్షల సమయంలో ఒత్తిడి కొన్ని కారణాలుగా పెరుగుతూ ఉంటుంది. వాటిలో ముఖ్యమైనవి సందేహాలు. పరీక్షల కోసం ప్రిపేరయ్యే సమయంలో ఏదైనా సందేహం వస్తే అది నివృత్తి కాకపోతే దానిమీదకే ఆలోచనలు పోయి సమయం వేస్ట్ అవుతుంది. అలాంటప్పుడు తమ వద్దకు వచ్చిన విద్యార్థుల సందేహాలను ఉపాధ్యాయులు అప్పటికప్పుడే నివృత్తి చేసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాలి. ప్రశ్నాపత్రం విషయంలో ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ పరీక్ష సమయాన్ని సద్వినియోగం చేసుకనేలా సూచనలివ్వాలి.

విద్యార్థులు ఆత్మపరిశీలన చేసుకోవాలి

ముందుగా ప్రతి విద్యార్థి ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఇప్పటికే కొన్ని పరీక్షలకు హాజరై ఉంటారు. కాబట్టి ఆ పరీ

క్షల్లో తమ ఫెర్‌ఫార్మెన్స్ ఎలా ఉందో బేరీజు వేసుకోవాలి. ఎక్కడ మిస్టేక్స్ చేస్తున్నామనే విషయాన్ని ఎవరికి వారు గ్రహించుకోవాలి. ఏ పాఠ్యాంశాలలో ఎలాంటి పొరపాటు చేస్తున్నది పాయింట్‌వారీగా నోట్ చేసుకుని ఆయా పాఠ్యాంశాలను అవసరమైనంత మేరకు అభ్యసించాలి. అందుకు ప్రత్యేక పద్ధతిని పాటిస్తూ ప్రణాళికలు వేసుకుని అభ్యసనం చేయాలి.

తల్లిదండ్రులు చేయాల్సినవి

ఏడాది పరీక్షలు, పలు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల విషయంలో తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకం. ముఖ్యంగా ఈ సమయంలో ఇంట్లో ప్రశాంత వాతావరణం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు కృషిచేయాలి. వారిలో ఒత్తిడి తగ్గించేందుకు తమవంతు ప్రయత్నం చేయాలి. పిల్లల్లో మరింత ఒత్తిడిని పెంచే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలి. అంతేకాక పిల్లలు ఎక్కువ సయం చదువుకే కేటాయిస్తారు. కాబట్టి వారి ఆరోగ్యం గురించి ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలి. చదువుకునే సమయంలో మనసు ఎక్కువ శ్రమకు గురవుతుంది. కాబట్టి సమయానుకూలంగా తగిన ఆహారం అందించాలి. చాలినంత నిద్ర లేకపోతే ఆరోగ్యం దెబ్బతింటుందనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుని తగినంత నిద్రపోయేలా చూడాలి.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

పరీక్షలు ముంచుకొస్తున్న తరుణంలో ఎలాంటి ఆందోళనకు గురికావద్దు. ఇప్పటికే సిలబస్ పూర్తయిన నేపథ్యంలో తాము నేర్చుకోవల్సిన అంశాలపై ప్రత్యేక దృష్టిని సారించాలి. ఇందుకోసం సయమాన్ని విభజించాలి. ప్రతి రోజూ 6 గంటలు నిద్రకు కేటాయించాలి. తెల్లవారుజామున 4 గంటల నుంచి చదవడం ప్రారంభించాలి. చదవదల్చుకున్న సబ్జెకును విభాగాలుగా చేసుకుని చదవాలి. ముందుగా కఠినంగా ఉన్న సమాధానాలపై దృష్టి సారించాలి. గంటలపాటు అదే సబ్జెక్టును చదవాలి. కొంతసేపు విశ్రాంతి తీసుకుని కొంత సులభంగా ఉన్న సబ్జెక్టుపై దృష్టి సారించాలి. నిద్ర వస్తుందనుకుంటే గణితం వంటి యుద్ధానికు పని కల్పించే సబ్జెక్టును ఎంపిక చేసుకోవాలి. అర్థం కాని వాటిని ఉపాధ్యాయులు లేదా నిపుణులను అడిగి తెలుసుకోవాలి. చదివిన అంశాలను అవకాశముంటే మిత్రులతో చర్చించాలి. ఒకటి, రెండు వాక్యాల సమాధానాలతో పాటు ఖాళీలను పూరించే వాటిని గుర్తించి ఎక్కువగా చర్చించాలి. ఎంతసేపు చదివామన్నది కాకుండా ఎంత నేర్చుకున్నామనే అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలి.

చదువు మధ్యలో తీసుకోవల్సిన జాగ్రత్తలు

పరీక్షల సమయంలో అదేపనిగా చదవడం వల్ల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉన్నది. చదివే సమయంలో ప్రతి గంటకోసారి కాసేపు మెదడుకు విశ్రాంతి ఇవ్వడం మంచిది. దీనివల్ల చదివిన విషయాలు మరిచిపోకుండా ఉంటాయి. అంతేకాకుండా మనస్సుకు ఉత్తేజాన్ని కలిగించే మ్యూజిక్, పిల్లలతో కాసేపు కాలక్షేపం చేయడం మంచిది. సాధ్యమైనంత వరకు పరీక్షల సమయంలో టీవీలు, సినిమాలు చూడడం మానేయాలి. ఉపాధ్యాయులు కూడా పరీక్షల సమయంలో విద్యార్థుల ప్రశ్నలను నివృత్తి చేయాలి. మంచి మార్కులు సాధించేలా సూచనలు, సలహాలు ఇవ్వాలి. కష్టపడి చదివిన వారి గురించి తెలియజెప్పాలి. ఏకాగ్రతతో చదివేలా ప్రోత్సహించాలి. చదువులో పూర్తిగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారు కూడా పరీక్షలు సక్రమంగా రాసేందుకు సిద్ధం చేయాలి.

పరీక్షల సమయంలో ఏకాగ్రతతో చదవాలి

పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఆందోళన చెందకుండా ఏకాగ్రతతో చదవాలి. బట్టీ పెట్టి చదవకుండా ప్రశాంతంగా మైండ్‌కు ఎక్కించుకునే రీతిలో చదువుకోవాలి. విద్యార్థులు ఆందోళన చెందకుండా సులువుగా ఉన్న సబ్జెక్టులను ముందుగా చదవాలి అర్థం కానివాటిని తెలుసుకుని మళ్లీ చదువుకుని పరీక్షల్లో బాగా రాణించాలి.

- పాండురంగం, ప్రధానోపాధ్యాయుడు

జోరుగా డిజిటల్ క్రాప్ సర్వే

- పైలట్ ప్రాజెక్టు కింది కొత్తూరు మండలంలో రెండు గ్రామాలు ఎంపిక
- ఇప్పటి వరకు 980 ఎకరాల్లో పూర్తయిన సర్వే
- ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు

కొత్తూరు, ఫిబ్రవరి 13 : డిజిటల్ క్రాప్ సర్వే మండలవ్యాప్తంగా జోరుగా కొనసాగుతున్నది. ఈ సర్వే ద్వారా పంటల సాగు వివరాలు నమోదు చేస్తారు. అలాగే భవిష్యత్‌లో పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలను అంచనా వేయటం వంటి ప్రయోజనాలు ఉండనున్నాయి. పంటల సాగు నమోదును మరింత కచ్చితంగా లెక్కించేందుకు కొత్త విధానం అమలుకు వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తున్నది.

రైతు పాలం వద్ద యూప్‌లో వివరాలు నమోదు చేయిస్తున్న మండల ఏవో గోపాల్

కొత్తూరు మండలంలో 4000 ఎకరాల్లో..

కొత్తూరు మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద సిద్దాపూర్, గూడూరు గ్రామాలను ఎంపిక చేశారు. రెండు గ్రామాల్లో కలిసి 4000 ఎకరాల్లో ఈ సర్వే జరుగనున్నది. ఇప్పటి వరకు సిద్దాపూర్‌లో 630 ఎకరాల్లో, గూడూరులో 350 ఎకరాలో సర్వే పూర్తయిందని మండల వ్యవసాయ అధికారి గోపాల్ తెలిపారు. సర్వే నంబర్లవారీగా ప్రతి రైతు పొలంలో పంటలను నమోదు చేసి యాప్‌లో పంట ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నామని వివరించారు.

సర్వే ప్రారంభ దశలో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఫోన్ యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెతున్నాయని.. నెట్ వర్క్ సమస్యలు, సర్వే నంబర్లు తప్పుగా చూపించడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని ఫీల్డ్‌కు వెళ్లే వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. సర్వే నిర్వహణకు సౌకర్యాల కొరత కూడా ఉందని అంటున్నారు. ప్రభుత్వం ఈ సవాళ్లను పరిష్కరించి సర్వేను సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నగల కోసమే మహిళ హత్య

- నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- హత్య కేసు వివరాలు వెల్లడించిన సీఐ కాంతారెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 13 : నగల కోసమే మహిళను హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. షాబాద్ సీఐ కాంతారెడ్డి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి హత్యకు గల కారణాలను వెల్లడించారు. షాబాద్ మండలంలోని మన్‌మర్రి గ్రామానికి చెందిన జటని సత్యమ్మ(65) హత్య జరిగిన సంఘటన పాఠకులకు విదితమే. ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన పత్యావత్ అనిల్‌కుమార్ తల్లిదండ్రులు చనిపోవడంతో తన అమ్మమ్మ ఊరైన కొందుర్గు మండలం కాస్లాబాద్ తండాలో ఇల్లు కట్టుకుని అక్కడే నివసిస్తున్నాడు. గతంలో రెండు బొలెరో వాహనాల్లో పీడీఎస్ బియ్యం సరఫరా చేస్తూ పోలీసులకు పట్టుబడడంతో అతడిపై కేసు నమోదైంది. వాహనాలు లేక జీవనోపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నెల 8న అనిల్ తన కారులో షాద్‌నగర్ వైపు వస్తుండగా మార్గమధ్యంలోని అప్పారెడ్డి గూడ గ్రామానికి చెందిన బీబీ, జటని సత్యమ్మ లింగారెడ్డిగూడ బస్‌స్టాప్ వద్ద కారు లిఫ్ట్ అడిగి అందులో ఎక్కారు. మార్గమధ్యంలోని మొగిలిగిద్ద వద్ద బీబీ కారు దిగి వెళ్లిపోయింది. షాద్‌నగర్ కంటి దవాఖానకు వెళ్తున్న సత్యమ్మ కారులో అలానే వెళ్లింది. ఆమె ఒంటిపై నగలను చూసి దురాశ కలిగిన అనిల్ రంగంపల్లి బస్‌స్టాప్ సమీపంలో నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకువెళ్లి నగలు ఇవ్వాలని కారులోనే ఆమెపై దాడి చేశాడు. స్పృహ కోల్పోయిన సత్యమ్మను ముళ్ల పొదల్లోకి ఈడ్చుకెళ్లి రాయితో తలపై కొట్టి చంపాడు. మృతి చెందిందని నిర్ధారించుకున్న తర్వాత ఆమె ఒంటిపై ఉన్న అర కిలో వెండి అభరణాలు, ఐదు తులాల బంగారు అభరణాలు తీసుకుని పరారయ్యాడు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల రికార్డులను పరిశీలించి కారు నంబర్ ఆధారంతో నిందితుడిని పోలీసులు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా తానే నగల కోసం సత్యమ్మను హత్య చేసినట్లు ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌నాయుడు, ఎస్ఐ సతీశ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మహిళ హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ కాంతారెడ్డి



1.30 ఎకరాలకు రూ.9 వేలు క్రిడిట్ అయినట్లు చూపిస్తున్న వ్యవసాయ శాఖ వారి రికార్డు

కొర్రీలతో అన్నదాతలు సతమతం

- సాగుకు యోగ్యమైన భూమిలోనూ పూర్తిగా రాని 'రైతు భరోసా'
- లబోదిబోమంటున్న అన్నదాతలు
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో వచ్చినదాని కంటే తక్కువగా వస్తున్నదని ఆవేదన

కొత్తూరు, ఫిబ్రవరి 13 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న 'రైతు భరోసా' రైతుకు భరోసాను ఇవ్వడంలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. కానీ మళ్లీ మాట మార్చి రూ.12 వేలు ఇస్తామని చెప్పింది. అందులో నుంచి సాగుకు యోగ్యమైన భూములు, సాగుకు యోగ్యంకాని భూములను రెండు రకాలుగా విభజించింది. సాగుకు యోగ్యం కాని భూములకు రైతు భరోసా ఇవ్వకపోతే ఎవరూ ప్రశ్నించరు. కానీ యోగ్యమైన భూములకు కూడా కొర్రీలు పెడుతున్నదని రైతులు లబోదిబోమంటున్నారు. పాస్‌బుక్‌లో ఉన్న సాగుకు యోగ్యమైన భూమి 2 ఎకరాలుంటే అందులో 1.5 ఎకరాలకే రైతు భరోసా వేస్తున్నారు. కొంత మంది రైతులకైతే ఎకరా ఉంటే కనీసం అర ఎకరాకు కూడా వేయడం లేదని అంటున్నారు. ఇలా చాలామంది రైతులకు కొర్రీలు పెడుతున్నారు. తమకు పాస్‌బుక్‌లో ఉన్న సాగుకు యోగ్యమైన భూమిలో ఎంతో కొంత కొర్రీ పెట్టి రైతు భరోసా వేస్తున్నారని వాపోతున్నారు.

రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారుల మధ్య కొరవడిన సమన్వయం

తమకు పాస్‌బుక్‌లో ఉన్న భూమి కంటే తక్కువగా వచ్చిందని వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు వెళ్తే రెవెన్యూ అధికారులను అడుగుమంటున్నారు. రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్తే వ్యవసాయ శాఖ అధికారులను అడుగుమంటున్నారు. ఇద్దరి మధ్యలో ఎవరిని అడుగాలో అర్థం కావడంలేదని రైతులు వాపోతున్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులను నిలదీస్తే తాము సరిగ్గానే రాసి పంపామని పై నుంచి రాలేదని జిల్లా వ్యవసాయాధికారులను అడగాలని చెబుతున్నారు.

నాకు 1.32 ఎకరాలుంటే 1.20 ఎకరాలకు రైతు భరోసా పడింది

నా పట్టాదారు పాస్‌పుస్తకంలో వివిధ నంబర్లపై 1.32 ఎకరాల పొలం ఉన్నది. అందులో 2 గుంటలు సాగుకు యోగ్యం కాదు. నాకు 1.30 ఎకరాలకు రైతు భరోసా పడాలి. కానీ 1.20 ఎకరాలకు పడింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పడిన రూ.9 వేలు ఇప్పుడు పండింది. ఎకరాకు రూ.12 వేలు పంచినా ప్రయోజనం లేదు. అధికారులను అడిగితే ఒకరిపై ఒకరు చెబుతున్నారు.

- గుండు అంజయ్య, ఫరూఖ్‌నగర్

ఆర్ఎస్ఆర్ ప్రకారం వేస్తున్నారు

- జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు

ప్రస్తుతం వేస్తున్న రైతు భరోసా నిధులను ఆర్ఎస్ఆర్ (రెవెన్యూ సెటిల్‌మంట్ రిజిస్టర్) ప్రకారం వేస్తున్నారు. ఈ రిజిస్టర్‌లో రైతుకు నిజంగా ఎంత పొలం ఉందో నమోదవుతుంది. రైతు పాస్‌బుక్‌లో ఆర్ఎస్ఆర్‌లో ఉన్న భూమి కంటే ఎక్కువగా ఉంటే ఆర్ఎస్ఆర్‌ను ప్రాతిపదికగా తీసుకొని రైతు భరోసా వేస్తున్నారు. అందువల్ల రైతు పాస్‌బుక్‌లో ఉన్న భూమి కంటే కొంత మందికి తక్కువగా పడుతున్నాయని చెప్పారు. ఒక వేళ నిజంగా రైతు పాస్‌బుక్‌లో భూమి, క్షేత్రంలో ఉన్న భూమి సమానంగా ఉండి.. ఆర్ఎస్ఆర్‌లో తక్కువగా ఉంటే తర్వాత పరిశీలించి తిరిగి రైతు భరోసా వేసే అవకాశం ఉంది.

కులకచర్ల ఎస్టీ హాస్టల్‌లో

విద్యార్థి అనుమానాస్పద మృతి!

- తోటి స్నేహితులతో కలిసి రాత్రి భోజనం చేసిన దేవేందర్
- తమ కుమారుడి మృతిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు
- పాఠశాల, విద్యార్థి స్వగ్రామంలో విషాదఛాయలు

విద్యార్థి దేవేందర్(ఫైల్)

పరిగి/కులకచర్ల, ఫిబ్రవరి 13 : మండల కేంద్రంలోని బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉంటూ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థి నేనావత్ దేవేందర్(15) గురువారం ఉదయం అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఎప్పటిలాగా అతడు తన స్నేహితులతో కలిసి బుధవారం పాఠశాల నుంచి గిరిజన ఆశ్రమ పాఠశాలకు వచ్చి రాత్రి అందరితో కలిసి భోజనం చేసి నిద్రించాడు. గురువారం ఉదయం స్నేహితులు లేచి పాఠశాలకు రెడీ అవ్వగా.. అతడు ఎంతకీ లేవకపోవడంతో ఆందోళన చెందిన తోటి విద్యార్థులు ఉదయం 6:30 గంటల ప్రాంతంలో హాస్టల్ కేర్ టేకర్‌కు తెలపగా.. అతడు వెంటనే 108కు సమాచారం అందించాడు. 108లో పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి విద్యార్థి మృతి చెందినట్లు నిర్ధారించారు. వికారాబాద్ మండలంలోని మద్గుల్‌చిట్టెంపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన టేకులబీడ్‌తండాకు చెందిన నేనావత్ సోనీబాయి-చందర్ దంపతుల రెండో కుమారుడు నేనావత్ దేవేందర్. అతడు చదువులో చురుగ్గా ఉండేవాడు. విద్యార్థులు, ఉపాధ్యాయులతోనూ కలిసిమెలిసి ఉండేవాడు. కాగా అతడు మృతి చెందడంతో ఆశ్రమ పాఠశాల, విద్యార్థి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మృతుడి కుటుంబానికి పరామర్శ

దేవేందర్ అనుమానాస్పదస్థితిలో మృతి చెందడంతో పరిగి దవాఖానలో అతడి మృతదేహాన్ని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సందర్శించి విద్యార్థి తండ్రి చందర్, కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం వారు వికారాబాద్ కలెక్టర్, అదనపు కలెక్టర్లతో మాట్లాడి.. మృతిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలన్నారు.

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలి

అనుమానాస్పదంగా మృతిచెందిన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని గిరిజన సంఘాల నాయకులు పరిగిలో డిమాండ్ చేశారు. దేవేందర్ మృతదేహాన్ని పరిగి దవాఖానకు తరలించగా అక్కడికి చేరుకున్న గిరిజన సంఘాల నాయకులు బహుజన్ ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింద్‌నాయక్, సేవ్యానాయక్‌లతోపాటు పలువురు గిరిజనులు దేవేందర్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఇస్తామని చర్చల సందర్భంగా డీటీడబ్ల్యూవో కమలాకర్‌రెడ్డి తెలిపారు. కేవలం ఉద్యోగమే కాకుండా విద్యార్థి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తమ కుమారుడి చావుకు కారణం ఏమిటో తేల్చాలని దేవేందర్ కుటుంబసభ్యులు అధికారులను కోరారు. చర్చలు కొలిక్కి రాకపోవడంతో గట్యానాయక్, గోవింద్‌నాయక్‌లతో పాటు పలువురు గిరిజనులు దేవేందర్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు.

ప్రధాన రోడ్డుపై ఆందోళన చేసేందుకు వెళ్తుండగా అక్కడ చేయొద్దని, ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించొద్దంటూ పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. దవాఖాన ఆవరణలో ఆందోళన నిర్వహిస్తామని వారు బైఠాయించగా రోగులు వస్తుంటారు మరోసారి పోలీసులు గిరిజన నాయకులపై మండిపడ్డారు. ఈ నేపథ్యం లో గిరిజనులు అక్కడే బైఠాయించి దేవేందర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతోపాటు రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దేవేందర్ అన్న గణేశ్‌కు ఔట్ సోర్సింగ్ ఉద్యోగంతోపాటు ఏదైనా పథకంలో 80 శాతం సబ్సిడీపై సంక్షేమ పథకం అందించి వారి జీవనోపాధికి సహకరిస్తామని అధికారులు చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. దేవేందర్ మృతదేహానికి డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించి.. కుటుంబసభ్యులకు అందించారు.

తల్లిదండ్రుల ఫిర్యాదు

తమ కుమారుడు దేవేందర్ ఆరోగ్యంగా ఉండేవాడని, అకస్మాత్తుగా మృతి చెందడంతో తమకు అనుమానంగా ఉందని అతడి తల్లిదండ్రులు చందర్-సోనీబాయిలు గురువారం కులకచర్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపారు. కాగా పరిగిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

విద్యార్థి తండ్రితో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

మృతుడి కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలంటూ ఆందోళన చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు, కుటుంబసభ్యులు

ఎల్ ఎఫ్ఎల్ యాప్‌తో రూ.88,623 పోగొట్టుకున్న మహిళ

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 13 : ఎల్ఎఫ్ఎల్ యాప్ తో అధిక డబ్బులు సంపాదించుకోవచ్చని ఉన్న డబ్బులను ఓ మహిళ పోగొట్టుకున్న సంఘటన చేవెళ్ల పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. చేవెళ్ల ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం.. చేవెళ్లలోని టీచర్స్ కాలనీలో నివాసముంటున్న కూతాడి పుష్పలత (35)కు ఆమెకి తెలిసిన స్నేహితులు డిసెంబర్ నెలలో ఎల్ఎఫ్ఎల్ యాప్‌లో డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే మనకు రెట్టింపు డబ్బులు వస్తాయని, ఇది చైన్ సిస్టం బిజినెస్ అని చెప్పడంతోపాటు ఆమెకు వాట్సాప్ ద్వారా ఎల్ఎఫ్ఎల్ యాప్ లింక్ పంపారు. డిసెంబర్ 8న ఎల్ఎఫ్ఎల్ యాప్‌లో రిజిస్టర్ చేసుకొని ఇన్వెస్ట్ చేయడం ప్రారంభించింది. అప్పటి నుంచి జనవరి 3 వరకు రూ.88,623 యాప్ ద్వారా వారికి ఇన్వెస్ట్ చేసింది. ఈ నేపథ్యంలో ఆ యాప్ క్లోజ్ చేశారని తెలుసుకుని వెంటనే సైబర్ క్రైమ్ 1930 కాల్ చేసి ఫిర్యాదు చేసింది. చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిబ్రవరి 13న ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.